
సంపుటి - 4 ఏప్రిల్-2021 సంచిక-5

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక




తండ్రి గారి సందేశం............................................3
పునరుత్థానం......................................................6
శోధన..............................................................9
బైబిల్ దర్శనం .................................................10
బ్రదర్ జోసఫ్ తంబి గారు.....................................12
ఏంజెల్స్ కార్నర్.................................................14
శుభవచనం బైబిల్ క్విజ్.......................................15
ఇంద్రధనుస్సు...................................................17
యువస్పందన....................................................19
సాక్ష్యం............................................................20
బైబిల్ దృశ్యమాలిక.............................................21
శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు..........................23



**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**



**సంపాదక వర్గం**

| | |
|---|---|
| ఫాదర్ సిజో | ఫాదర్ యోహాన్ |
| ఫాదర్ మహేశ్ | సిస్టర్ క్రిస్టీన CMC |
| సిస్టర్ హృదయ ASMI | Mr. J. లూర్దు స్వామి |
| Mr. M. సత్యం | Mrs. K. శ్రీలత |

**టైపింగ్ సహకారం** – D. ప్రిన్సి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల- 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**

**Cell: 09398764408**

**Email ID - jeevaswaramadilabad@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**“మన బాధలలో కూడ మనము ఆనందించుదము.**

**ఏలయున, కష్టములు ఓర్పును, ఓర్పు సచ్ఛీలమును,**

**సచ్ఛీలము నిరీక్షణను కలిగించును.**

**ఈ నిరీక్షణ మనకు నిరాశను కలిగింపదు. ఏలయున,**

**దేవుడు మనకొసగిన పవిత్రాత్మ ద్వారా తన ప్రేమతో మన**

**హృదయములను నింపెను”.**

**(రోమీ 5,3-5)**

**జనవరి నెల**

**శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు**

మొదటి బహుమతి

**డి. శంకర్, దేవాపూర్**

రెండవ బహుమతి

**కె. నయన, ఇంద్రవెల్లి**

మూడవ బహుమతి

**కె. శ్రావణి, గొలెట్టి**

**బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి**

**జనవరి నెల**

**ఇంద్రధనుస్సు విజేతలు**

మొదటి బహుమతి

**ఎస్. శాన్వి, ఇంద్రవెల్లి**

రెండవ బహుమతి

**ఎన్. సంకీర్తన, సాలిగాం**

**బి. బాలస్వాతిక్ రెడ్డి, దేవాపూర్**

మూడవ బహుమతి

**ఎమ్. బ్లెస్సీ, సాలిగాం**

**బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి**

# తండ్రి గారి సందేశం....



## పునరుత్థానము ప్రకటించునదేమి

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

క్రీస్తు మరణ, భూస్థాపన, పునరుత్థానములు మన విశ్వాసానికి, దేవునితో మనకున్న బాంధవానికి కేంద్రమైయున్నాయి (1 కొరింతీ 15,1-4). దివ్యబలి అర్పించే ప్రతిసారి క్రీస్తు మరణ, భూస్థాపన, పునరుత్థానాలను మనం జ్ఞాపకం చేసుకొంటాం. ఈ సందర్భంలో మనం "పునరుత్థానపు ప్రాధాన్యత ఏమి?" "ఆ గొప్ప సంఘటన ఏమి ప్రకటిస్తుంది?" అనే దాని గురించి ధ్యానిద్దాం.

మొదటిగా, పునరుత్థానం క్రీస్తు దైవత్వాన్ని ప్రకటిస్తుంది. "ఆయన మృతులలో నుండి పునరుత్థానుడై నందున పవిత్ర పరచు ఆత్మ శక్తితో దేవుని కుమారుడుగా నియమింపబడెను" (రోమీ 1,4). పునరుత్థానం యేసు దేవున్ని కుమారుడని నిరూపిస్తుంది. మగ్దలేనే మరియ ద్వారా యేసు ప్రభు ఉత్థానం గురించి సమాచారం అందుకున్న ఇద్దరు అపోస్తలులు సమాధి యొద్దకు పరుగెత్తారు. పేతురు గారితో వచ్చిన యోహాను గారు ఏమి నమ్మాలో ఎరుగకయే ఆయనతో పాటు సమాధిలోకి ప్రవేశించాడు. తరువాత సమాధిలో ఏముందో అతడు చూసాడు. "సీమోను పేతురు వచ్చి, సమాధిలో ప్రవేశించి, అచట పడియున్న నార వస్త్రములను, ఆయన తలకు కట్టిన తుండు గుడ్డను చూచెను. ఆ తుండు గుడ్డ నార వస్త్రములతోపాటు కాక, విడిగ చుట్టి ఉంచబడెను. సమాధి యొద్దకు మొదట వచ్చిన శిష్యుడు కూడ లోనికి వెళ్లి చూచి నమ్మెను" (యోహాను 20,6-8).

విశ్వసింపదగినది యోహాను ఏమి చూసాడు? యేసు మృతదేహాన్ని ఎవరైనా తొందరగా అక్కడ నుండి తరలించి ఉంటే చుట్టిన నారబట్టలను తొలిగించడం, తల రుమాలు మడిచి వెరొకచోట చుట్టి పెట్టటం వంటి పనులు చేయడానికి వీలుగాని, అవసరంగాని ఉండదు. యోహాను చూచింది మానవ సామర్థ్యానికి పొసగనిదే గాని, దైవీకమైన జోక్యానికి అవకాశం లేనిదికాదు. పునరుత్థానాన్ని గూర్చి ప్రభువు తరచుగా పలికిన దానికి అది అనుగుణమైనదిగానే ఉంది. (మత్తయి 16,21; 17,23; 20,19; మార్కు 8,31; 9,31; 10,34; లూకా 9,22; యోహాను 2,19)

క్రీస్తు శిష్యులలో కలిగిన మార్పు పునరుత్థానానికి సాక్ష్యంగా ఉంది. ఆయన బంధింపబడినప్పుడు గాని తీర్పు తీర్చబడేటప్పుడు గాని క్రీస్తు అనుచరుల ప్రవర్తన ఎవ్వరిని ఆకట్టుకోలేదు. ధైర్యమన్నది వారికి లేదు. వారు ప్రాణాలపై తీపితో పారిపోయారు, అపాయానికి బెదిరి దూరంగా తొలగిపోయారు. పేతురైతే యేసును ఎరుగనని పలికాడు. అయినా, పునరుత్థానం తరువాత, వారే యేసును గూర్చి బహిరంగంగాను, ధైర్యంగాను ప్రకటించారు. వారు మారిన తీరు క్రొత్తనిబంధన అంతా మారు మ్రోగుతుంది. శిష్యులు ఏ విషయమై అంత నిశ్చయంగా ఉన్నారు? వారు విశ్వసించిన యేసు ఇప్పుడు సజీవుడు, పునరుత్థానుడు. ఈ నిశ్చయత అపోస్తలుల జీవితాలనే మార్చివేస్తుంది. వారు చెరసాలపాలైనా, కొరడాలతో కొట్టబడినా, రాళ్లతో కొట్టబడినా, చంపబడినా - వారి విశ్వాసం అచంచలమైనది. బలహీనులు, విశ్వాసంలేని వ్యక్తులు, లోకము ఎన్నడూ ఎరుగనంత మహా గొప్ప సంచలనాత్మకమైన వ్యక్తులుగా మారిపోయారు. వారి ఉపదేశము రోమా సామ్రాజ్యాన్నే వణికించింది. పునరుత్థానాన్ని ప్రక్కనపెట్టి శిష్యులలో

కలిగిన మార్పును గూర్చి వివరించడం సాధ్యం కాదు. పునరుత్థానుడైన ప్రభువును వారు చూచారు. అది వారి జీవితాలను శాశ్వతంగా మార్చివేసింది. పునరుత్థానము యేసు దేవుని కుమారుడనే సత్యాన్ని రుజువు చేస్తుంది. ఆ గొప్ప సత్యం నేటికి కూడా ప్రకటింపబడుతుంది.

రెండవది, సిలువపై క్రీస్తు బలిని దేవుడు అంగీకరించినట్టు పునరుత్థానము ప్రకటించింది. క్రైస్తవ్యం సిలువపై కేంద్రీకృతమైఉంది. "సిలువ రక్తముచేత" మనం దేవునితో సమాధానపరచబడ్డాము (ఎఫెసీ 2,16). క్రీస్తు బలివలన దేవుని న్యాయము సంతృప్తి పరచబడింది. దానిని బట్టి మనకు నిత్యజీవమును గూర్చిన నిరీక్షణ కలిగింది. "నేను మీతో ఉన్నప్పుడు, యేసుక్రీస్తును గూర్చియు, అందును ముఖ్యముగా సిలువపై ఉన్న ఆయన మరణమును గూర్చియు, తప్ప మరేమియు తెలిసికొన కూడదని నేను నిశ్చయించుకొంటిని'' (1 కొరింథీ 2,2). యేసు మృతులలో నుండి లేపబడక ఉండినట్లైతే సిలువ మరణం యొక్క ఉద్దేశం నెరవేర్చిందో లేదో మనకు నిశ్చయత కలిగే వీలు ఉండేదికాదు. మన పాపముల కొరకు క్రీస్తు ప్రభువు బలిని దేవుడు అంగీకరించినట్టు ఆయన పునరుత్థానం ప్రకటించింది. దీని ప్రకారం, మనము క్రీస్తు మరణమును బట్టి మాత్రమే గాక, ఆయన పునరుత్థానమువలన రక్షింపబడినవారమై ఉన్నాము. "మన పాపమునకు గాను ఆయన మరణమునకు అప్పగించబడెను. మనలను దేవునకు అంగీకార యోగ్యులముగ ఒనర్చుటకు గాను ఆయన లేవనెత్తబడెను" (రోమీ 4,25).

మూడవది, క్రీస్తు బలిని దేవుడు అంగీకరించిన దానికి ప్రతిఫలముగా వచ్చిన సంతోషకరమైన ఫలితము -నీవు, నేను రక్షించబడగలడమే! పాపము నుండి నూతన జీవము పొంది నడుచుకొనుటకు మనము లేపబడుతామని పునరుత్థానం ప్రకటించింది. క్రీస్తు శరీర పునరుత్థానానికి, నూతన జీవము పొందుటకు లేపబడే ఆత్మ సంబంధమైన మన పునరుత్థానానికి సంబంధమున్నట్టు పరిశుద్ధ గ్రంథం స్పష్టం చేస్తుంది. "కనుక, మన జ్ఞానస్నానము వలన మనము ఆయనతో సమాధి చేయబడి ఆయన మరణమును పాలు పంచుకొంటిమి. ఏలయన, తండ్రి ప్రభావముచే మరణము నుండి క్రీస్తు లేవనెత్తబడినట్లే, మనమును ఒక క్రొత్త జీవితమును గడుపుటకే అట్లు జరిగెను. ఆయన మరణములో మనము ఆయనతో ఏకమై యుందుము. పాపపు శరీరము నశించి మనము ఇక పాపమునకు బానిసలు కాకుండునట్లు, మన పాత స్వభావము ఆయనతో సిలువపై చంపబడినది అని మనకు తెలియును'' (రోమీ 6,4-6). పునీత పౌలు ఎఫెసీయులకు వ్రాస్తూ, ఈ విధంగా అన్నాడు. "అవిధేయత వలన ఆధ్యాత్మికముగ నిర్జీవులమై ఉన్న మనలను, క్రీస్తుతో కూడ ఆయన పునర్జీవులను చేసెను. దేవుని దయవలననే మీరు రక్షింపబడితిరి" (ఎఫెసీ 2,5).

నాలుగవది, ఒకనాడు మన దేహాలు కూడా మృతులలో నుండి లేపబడతాయని యేసు పునరుత్థానం ప్రకటిస్తుంది! చాలా కాలం క్రిందట, "మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?'' అని యోబు ప్రశ్నించాడు (యోబు 14,14). దానికి జవాబు - "అవును-ఎందుకంటే క్రీస్తు లేపబడ్డారు". ఈ సత్యము 1 కొరింథీ 15వ అధ్యాయంలో స్థాపించబడింది. "మరణమున నిద్రించుచున్న వారు లేవనెత్తబడుదురని ధ్రువపరచుటకు క్రీస్తు మృత్యువు నుండి లేవనెత్త బడెననుట సత్యము. ఏలయన, ఒక మనుష్యుని మూలమున మరణము ప్రవేశించినట్లే, మృత్యుల పునరుత్థానము కూడ ఒక మనుష్యుని మూలముననే వచ్చినది. ఆదాము నందు అందుకు ఎట్లు మృతి చెందుతున్నారో అటులనే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు. కాని ప్రతి వ్యక్తియు తన క్రమమును బట్టియే. ప్రథమ ఫలము క్రీస్తు, తరువాత ఆయన రాకడ సమయమున ఆయనకు చెందినవారు" (1 కొరింథీ 15,20-25). మరణం అనేది ఇక ఎన్నడూ అడ్డుగోడయై ఉండదు కాని ద్వారమై ఉంటుంది. ఇది నిజమని యేసు పునరుత్థానం మనకు అభయమిస్తుంది.

ఐదవది, దేవుడు తన మాటకు బద్ధుడైయుంటాడని పునరుత్థానం ప్రకటిస్తుంది. "ఈ ఆలయమును మీరు పడగొట్టుడు. నేను దీనిని మూడు రోజులలో లేపుదును." కాని, వాస్తవముగ ఆయన పలికినది తన శరీరము అను ఆలయమును గురించియే (యోహాను 2,19+21). ఈ ప్రవచన వాక్యాన్ని క్రీస్తు ప్రభువునకు విరోధంగా ప్రజలు ధర్మశాస్త్ర బోధకులు వాడుకున్నారు. (మత్తయి 26,61) యేసు సిలువపై ఉన్నప్పుడు, "దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా" అని, అర్థరహితంగా వారు హేళన చేసారు (మత్తయి 27,40). ఈ ప్రవచనపు వాక్యం నెరవేర్పబడింది. ఆయన శరీరము– తన భూసంబంధమైన దేవాలయం – సిలువలో చనిపోయింది, మరియు మూడవ దినమున, ఆ శరీరము లేపబడింది. ప్రభువు అలా జరుగుతుందంటే, అలాగే జరుగుతుంది. యేసు ప్రభు తాను చెప్పిన మాటలను నెరవేర్చువాడు, తన మాటలకు బద్ధుడై ఉండేవాడు. ఆయన నమ్మదగిన వాడు.

ప్రియ సహోదరీ సహోదరులారా, పునరుత్థాన పండుగను జరుపుకోవడానికి సిద్ధపడుతున్న మనమందరం క్రీస్తు పునరుత్థానంలో భాగస్వాములం అవడానికి మనం మన పాపములకు, పాప జీవితానికి సిలువ వేయబడి పాపక్షమాపణము పొంది క్రీస్తుతో తిరిగి లేవనెత్తబడుటకు మనల్ని మనం సిద్ధపడాలి. నూతనమైన జీవాన్ని పొందుకునే భాగ్యాన్ని మనం పొందుకోవాలి. దేవుడు మనలను దీవించును గాక.


**మీకందరికి పునరుత్థాన పండుగ శుభాకాంక్షలు**

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు మరియు ఆదిలాబాద్ గురుపీఠంలో సువార్త వ్యాప్తి కొరకు నిర్మించబడుతున్న ధ్యానకేంద్రాన్ని ఆశీర్వదించండి. ఎటువంటి ఆటంకములు లేకుండా దానిని సకాలంలో పూర్తి చేయుటకు తద్వారా మీ సువార్తను ప్రకటించుటకు మాకు అనుగ్రహం దయచేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.





# పునరుత్థానం

ప్రియులారా, యేసు ప్రభు పునరుత్థానమును గురించి పరిశుద్ధ గ్రంథం ఆధారంగా ధ్యానిద్దాం.

1. క్రీస్తు పాతాళములో విడువబడలేదు. ఆయన శరీరము కుళ్ళిపోలేదు అని దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను. (అ.కా. 2,31)

2. ప్రభువైన యేసు పునరుత్థానమును గూర్చి అపోస్తులులు మహాశక్తితో సాక్ష్యము లిచ్చిరి. సర్వేశ్వరుడు తన దైవకృపను సమృద్ధిగా వారిపై క్రుమ్మరించెను. (అ.కా. 4,33)

3. కాని, ఆయన మృతులలో నుండి పునరుత్థాను డైనందున పవిత్ర పరచు ఆత్మ శక్తితో దేవుని కుమారుడుగ నియమింపబడెను. (రోమీ 1.4)

4. ఆయన మరణములో మనము ఆయనతో ఏకమైయుండిన, ఆయన పునరుత్థానములో కూడ మనము తప్పక ఆయనతో ఏకమైయుందుము. (రోమీ 6,5)

5. మృత్యువు నుండి క్రీస్తు జీవముతో లేవనెత్తబడెను అని గదా మా సందేశము! మరి మృతుల పునరుత్థానము లేదని మీలో కొందరు ఎట్లు చెప్పుచున్నారు? (1 కొరంతీ 15,12)

6. అపుడు యేసు " నేనే పునరుత్థానమును జీవమును, నన్ను విశ్వసించువాడు మరణించినను జీవించును. జీవించి ఉండగా నన్ను విశ్వసించు ప్రతివాడు ఎన్నటికి మరణింపడు. నీవు దీనిని విశ్వసించుచున్నావా?" (యోహాను 11,25-26),

7. అతడు వారితో "మీరు భయపడకుడు. సిలువ వేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదకుచున్నారు. ఆయన పునరుత్థానుడయ్యెను. ఇక్కడ లేడు. వచ్చి ఆయనను ఉంచిన స్థలమును చూడుడు. (మార్కు 16,6)

8. "ఆయన ఇక్కడ లేడు, లేచియున్నాడు. మనుష్య కుమారుడు పాపుల చేతికి అప్పగింపబడి, సిలువ వేయబడి, మూడవ రోజున సజీవుడై లేవవలెనని మీతో

చెప్పెను గదా! ఆయన గలిలీయలో ఉన్నప్పుడు మీతో చెప్పిన మాటలు స్మరింపుడు" అనిరి. (లూకా 24,6-7)

9. మన ప్రభువు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడునుగాక! మృతులలో నుండి యేసుక్రీస్తును ఆయన పునరుత్థానమొనరించి, దాని మూలమున మనకు నూత్నజీవమును ప్రసాదించెను. విశిష్టమగు ఆయన కనికరమే దీనికి కారణము. ఇది మనలను సజీవమగు నిరీక్షణతో నింపును. (1 పేతురు 1,3)

10. దూత స్త్రీలతో "భయపడకుడు. మీరు సిలువ వేయబడిన యేసును వెదకుచున్నారని నేను ఎరుగుదును. ఆయన ఇక్కడ లేడు. తాను చెప్పినట్లు సమాధి నుండి లేచెను. ఆయనను ఉంచిన స్థలమును చూడుడు." (మత్తయి 28,5-6)

11. ఏలన, మేము క్రీస్తు ప్రేమచే పరిపాలింప బడుచున్నాము. అందరి కొరకు ఆయన ఒక్కడు మరణించెనని మనము ఇప్పుడు గుర్తించితిమి గదా! అనగా మానవులందరు ఆయన మృత్యువు నందు పాల్గొందురనియే గదా భావము. జీవించుచున్న వారు, ఇక మీదట కేవలము తమ కొరకు కాక, ఆయన కొరకే జీవించుటకు క్రీస్తు మానవులందరి కొరకు మరణించెను. ఆయన మరణించి, పునరుత్థానము చెందినది వారి కొరకే గదా! (2 కొరంతీ 5,14-15)

12.నేను పొందిన దానిని మీకు మొదట అందించితిని. పరిశుద్ధ గ్రంథమున వ్రాయబడినట్లు క్రీస్తు మన పాపముల కొరకై మరణించెను. పరిశుద్ధ గ్రంథమున, వ్రాయబడినట్లు ఆయన సమాధి చేయబడి, మూడవ దినమున సజీవుడుగ లేవనెత్తబడెను. (1 కొరంతీ 15, 3-4)

13. ఈ జలము జ్ఞానస్నాన సూచకమగు ఒక చిహ్నము. నేడు ఈ జ్ఞానస్నానమే మిమ్ము కాపాడును. కాని కేవలము శారీరక శుద్ధిచే కాదు. పవిత్రమగు అంత:కరణముచే దేవునికి చేయబడిన వాగ్దానము ద్వారా అది మిమ్ము రక్షించును. యేసుక్రీస్తు పునరుత్థానము ద్వారా జ్ఞానస్నానము మిమ్ము రక్షించును. (1 పేతురు 3,21)

14. నీ నోటితో యేసు 'ప్రభువు' అని ఒప్పుకొని, మృతులలో నుండి దేవుడు ఆయనను లేవనెత్తనని నీ హృదయమున నీవు విశ్వసించినచో నీవు రక్షింపబడుదువు. (రోమీ 10,9)


15. ఐనచో శిక్ష విధించువాడు ఎవడు? క్రీస్తు యేసే! ఆయన చనిపోయి జీవముతో లేవనెత్తబడి, దేవుని కుడి ప్రక్కన ఉండి మన మధ్యవర్తిగ మనకొరకై విజ్ఞాపన చేయువాడు. (రోమీ 8,34)

16. ఏలన, జీవించియున్న వారిని, మరణించిన వారిని పాలించు నిమిత్తమే క్రీస్తు మరణించి సజీవుడయ్యెను. (రోమీ 14,9)

ప్రియులారా! క్రీస్తు పునరుత్థానంలో విశ్వాసముంచి జీవిద్దాం. దేవుడు మనలందరిని దీవించును గాక. ఆమెన్.

**"నీ దేవుడైన ప్రభువు నీ నడుమనున్నాడు. అతని బలము వలన నీకు విజయము కలుగును. అతడు నిన్ను గాంచి ఆనందించును. ప్రేమతో నీకు నూత్న జీవమును ఒసగును".**

**(జెఫన్యా 3,17)**



# శోధన

శోధనకు ఎవరూ అతీతులు కారు. అందరూ శోధనకు గురి అవుతున్నవారే. అయితే పెద్దవారు తాము అన్ని శోధనలను జయించామని, ఇక తాము శోధనలకు గురికాము అని అనుకుంటారు. అయితే బైబిల్‌లో పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళు శోధనలో పడిపోయారు. కాబట్టి శోధనకు వయోపరిమితి లేదు. మనకున్నటువంటి ఒక అవగాహన ఏమిటంటే యువత చాలా సులువుగా శోధనలో పడిపోతారని. కాని, అలాంటి దేమిలేదు. ఏ వయసుకు తగ్గ శోధనలు ఆ వయసువారికి ఉంటాయి. యేసు ప్రభుని ఒక మాదిరిగా తీసుకొని, ఆయన శోధనను ఎలా ఎదుర్కొన్నాడు, ఎలా తట్టుకొని నిలబడ్డాడు అని ధ్యానిద్దాం. ఎందుకంటే అన్ని విషయాలలో ఆయనే మనకు మాదిరి. ఆయనకు మించిన వ్యక్తి ఏ విషయంలో కూడలేదు. బైబిల్‌లో ఉన్న విశ్వాస వీరులలో ఎవరిని తీసుకున్నా ఏదో ఒక లోపం కనబడుతుంది. యేసు ప్రభువే మనకు ఆదర్శం. ఆయన లోపం లేనటువంటి, అత్యంత పరిపూర్ణమైన, శ్రేష్టమైన నమూనాగా, మార్గదర్శిగా మనముందున్నాడు. కనుక యేసు ఏ విధంగా ఈ శోధనలను ఎదుర్కొన్నాడో చూడటం, ధ్యానించడం మంచిదని నేను అనుకుంటున్నాను.

బైబిల్‌లోని మత్తయి సువార్త 4వ అధ్యాయం మొదటి 11వచనాల గూర్చి ధ్యానిద్దాం. నలభై దినాల ఉపవాసం అనంతరం ఎదుర్కొన్న ఒక ప్రముఖమైన శోధన. అయితే ఇది మాత్రమే ఆయన ఎదుర్కొన్న శోధన అని అనుకోవద్దు. జీవితకాలంలో ఆయన ఎదుర్కున్న శోధనలలో ఇది ముఖ్యమైనది. అయితే యేసు ప్రభు శోధనల నుండి, ముఖ్యంగా ఆయన 40 దినాల కఠిన ఉపవాసం ఉన్న తరువాత ఎదుర్కొన్న ఈ శోధనల నుండి మనం అద్భుతమైన పాఠాలను నేర్చుకోవచ్చు. మొదటిది, మనం శోధనలను మనం ఎలా ఎదుర్కొవాలి అన్నదానికంటే శోధనలను మనం


ఎలా అర్థం చేసుకోవాలి? యేసుక్రీస్తు యొక్క సన్నివేశాన్ని జాగ్రత్తగా గమనించినట్లయితే శోధనల ముందు మనం అర్థం చేసుకోవలసిన అంశాలు మనకు కనబడతాయి.

శోధన అంటే ఏమిటో మనకు తెలియకపోతే శోధనలను మనం ఎదుర్కోలేము. శోధన ఎంటే ఎంటో మనం ముందు తెలుసుకోవాలి. యేసు ప్రభు శోధనను ఎదుర్కొన్న సందర్భంలోని పూర్వపరాలను మనం తెలుసుకోవాలి. అసలు శోధన అంటే ఏమిటి? యేసు ప్రభు పొందుకున్న శోధన ఆయన అహాన్ని రెచ్చగొట్టేదిగా ఉంది. అహం అంటే మన లోపల ఒక మనిషి ఉంటాడు. వాడు బయటికి కన్పించడు. ఇంగ్లీష్‌లో ఒక మంచి మాట ఉంది "ఫేస్ ఈస్ ద ఇండెక్స్ ఆఫ్ ద సోల్" అంటే నీ లోపల మనిషి ఎవరైతే ఉన్నారో ఆ మనిషి యొక్క ఆహభావాలన్నిటిని ఒక "పవర్ పాయింట్ షో" ఇచ్చేది ఏమిటంటే మన ముఖమే! ఉదాహరణకు ఫిట్స్ వచ్చిన మనిషి యొక్క ముఖం మీద నీళ్ళు చల్లితే వెంటనే లేచి కూర్చుంటాడు. ఇతర శరీర భాగాలపై నీళ్ళు చల్లి చూడండి, లేవ లేదు. లోపల ప్రాణం తెప్పరిల్లేది ముఖం మీద నీళ్ళు చల్లుకుంటేనే! శోధన ఒక విధంగా మన అహాన్ని రెచ్చగొట్టేదిగా అంటే మన ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేదిగా ఉంటుంది.

యేసు ప్రభు జీవితంలోని మూడు శోధనలలో ఒకటి ఆకలికి సంబంధించినది. మనిషికి ఆకలి సహజం, ఆకలి వేస్తే అన్నం తినడం తప్పా? కాదు. యేసుప్రభువుకు శోధన ఎక్కడ వచ్చింది, ఏదో ఒక చెడ్డపని చేయమని కాదు. మనిషి అవసరం విషయంలోనే. ఆకలి వేస్తే అన్నం తినడం అవసరం. ఇది నాకు అవసరం అనిపించిన తరువాత అది నాకు తప్పు అనిపించదు. ఒక వేళ మీకు గాని నాకు గాని ఇలాంటి శోధన వచ్చి ఉంటే అసలు అది శోధన అని గుర్తించడమే కష్టం. నలభై రోజులు భోజనం చేయకుండా మనం గదిలో నుండి బయటికి వచ్చిన తరువాత మనకు బిర్యాని కానిఅన్ని రకాల వంటకాలతో కాని భోజనం పెడితే మనకు తప్పు అనిపించదు. అయితే యేసు ప్రభు వివేచనా శక్తి ఎంతగొప్పది అంటే తన అవసరంలో కూడ శోధనకు గురి కాకుండా చూసుకున్నారు. మనకు శోధనకు లోనుకాకూడదనుకుంటే ముందు మనం శోధనను గుర్తించాలి. చాలా మందికి సెల్‌ఫోన్ అవసరం. కాని చాలా మందికి సెల్‌ఫోన్ వాడే కొన్ని సమయాలలో వారు శోధనలకు గురి అవుతున్నారని గుర్తించరు. చాలా మందికి స్నేహితులు అవసరం. చాలా మంది స్నేహంలో చెడుతనం ఉన్నప్పుడు వారు శోధనలో ఉన్నారన్న విషయం గుర్తించేలోపు జరగరానిది జరిగిపోతుంది. చాలా మందికి చదువు అవసరం. అదే వారికి ఒక పెద్ద శోధన అని గుర్తించరు. నేను ఫస్ట్ రావాలి. అందుకే పదికి పది అని బలంగా కోరుకొని తొమ్మిది మార్కులు మాత్రమే వస్తే కొంతమంది నిరాశకు గురైవుతారు, విపరీత సందర్భాలలో ఆత్మహత్య చేసుకుంటారు. ఎందుకంటే వారు పోటీలో ఓడిపోయామని భావిస్తారు.

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

లూర్థుస్వామి
బెల్లంపల్లి



## గలిలియలో సువార్త బోధ (5-16,12)

### 1. పర్వత ప్రసంగం (మత్తయి సువార్త 5-7అధ్యాయాలు)


ఈ సువిశేషంలో క్రీస్తు ఐదు ప్రసంగాలు చేస్తాడు. వాటిల్లో మొదటిది పర్వత ప్రసంగం. ఇది ఈ గ్రంథంలోకెల్లా సుప్రసిద్ధమైన భాగం. క్రీస్తు పలు తావుల్లో పలు సందర్భాల్లో చెప్పిన నీతిబోధలను మత్తయి ఇక్కడ ఏకకాల బోధలాగ పొందుపరచాడు. పూర్వం మోషే ప్రజలకు ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు. మోషే బోధ ప్రాత శకానికి, క్రీస్తు ఉపదేశం నూత్న శకానికి. మనం ఈ పర్వత ప్రసంగం బోధలను జాగ్రత్తగా అర్థం చేసుకొని వాటిని జీవితంలో పాటించాలి. ఈ భాగం నూత్న నిబంధనలోని అతి ముఖ్య ఘట్టాల్లో ఒకటి. ఇక దీనిలోని ప్రధానాంశాలను కొన్నిటిని పరిశీలిద్దాం.

మూడు నుంచి పన్నెండు వరకు ఉన్న వచనాలను అష్టభాగ్యాలు అంటారు. వీటిల్లో "దీనాత్ములు ధన్యులు" అనే మొదటి వచనం ముఖ్యమైంది- 5,3. యూదుల్లో "అనవిం" అనే వర్గం ప్రజలు ఉండేవారు. శ్రమల్లో కూడ దేవుని మీద ఆధారపడి జీవించడం వీరి ముఖ్యలక్షణం. వీరినే రచయిత ఇక్కడ దీనాత్ములు అని పేర్కొన్నాడు. వినయవంతుడు దేవున్ని నమ్మి అతని మీద ఆధారపడుతాడు. పొగరుబోతు తన మీద తానే ఆధారపడతాడు. పసిబిడ్డ తల్లిదండ్రుల మీదలాగ మనం దేవుని మీద ఆధారపడి జీవించాలి. మనకు అహంకారం తగదు. నాకు నేను చాలు అని అనుకోకూడదు. ఇది ఈ ధన్యవచనం భావం.

ప్రభువు శిష్యులకు ఉప్పు, వెలుగు అనే ఉపమానాలు వాడాడు 5,13-14. ఉప్పు భోజనానికి రుచినిస్తుంది. భోజనాన్ని చెడిపోకుండ పదిలపరుస్తుంది. శిష్యులు కూడ క్రీస్తు బోధనలు అనే ఉప్పుతో లోకాన్ని పదిలపరచాలి. అందరికి క్రీస్తు విలువలను అందచేయాలి. ఇంకా, శిష్యులు లోకానికి

వెలుగుగా ఉండాలి. పూర్వనిబంధనలో ధర్మశాస్త్రం వెలుగు. నూతన నిబంధనలో క్రీస్తు బోధలే వెలుగు. వారు ఆ వెలుగుతో లోకాన్ని నింపాలి. ప్రజలు క్రీస్తు విలువల ప్రకారం జీవించేలా చేయాలి. ప్రభువు ధర్మశాస్త్రాన్ని రద్దుజేయడు. దాన్ని సంపూర్ణం చేస్తాడు. మోషే బోధలు అన్ని మతాల వారు పాటింపదగినవే. అవి ధార్మిక జీవితానికి మూల సూత్రాలు. క్రైస్తవులమైన మన ధార్మిక జీవితం యూదుల ధార్మిక జీవితాన్ని మించిపోవాలి 5,20. ఎలా మించిపోవాలో సూచిస్తూ క్రీస్తు ఇక్కడ ఆరు అంశాలు పేర్కొన్నాడు. అవి- 1. యూదుల ధర్మశాస్త్రం హత్యను నిషేదించింది. క్రైస్తవులమైన మనం పొరుగువాడి మీద కోప్పడడంగూడ మానుకోవాలి. 2. మోషే వ్యభిచారాన్ని నిషేధించాడు. మనకు కామేచ్ఛగూడ పనికిరాదు. 3. మోషే ఆనాటి పురుషుల హృదయ కాఠిన్యాన్ని జూచి విడాకులు అనుమతించాడు. కాని మనకు విడాకులు ఎంతమాత్రం పనికిరావు. 4. మోషే దేవుని పేరు మీదుగా ప్రమాణాలు చేయడానికి అనుమతినిచ్చాడు. కాని మనం దేవుని పేరు మీదుగా ఒట్టు పెట్టుకోగూడదు. 5. ఇంకా, ధర్మశాస్త్రం ఎంత కీడుకి అంత ప్రతీకారాన్ని అనుమతించింది. కాని మనకు పగతీర్చుకోవడం పనికిరాదు. 6. ధర్మశాస్త్రం శత్రువుని ద్వేషించమన్నది. కాని మనం శత్రువుని కూడ ప్రేమించాలి.

దానధర్మాలు, ప్రార్థన, ఉపవాసం యూదుల భక్తి జీవితానికి మూల స్థంభాలు. మనం కూడ ఈ పుణ్యకార్యాలు చేయాలి. కాని ఈ కార్యాలను చేసేటప్పుడు మనం నరుల మెప్పు పొందడమే ముఖ్యం అనుకోకూడదు. దేవుని మెప్పు పొందడం ప్రధానం అనుకోవాలి. మన కార్యాలను దేవుడు చూస్తే చాలు - 6,6. అన్యజాతి వారు వ్యర్థపదాలతో దీర్ఘ ప్రార్థనలు చేస్తున్నారు. పరిసయులు ప్రజల దృష్టిని ఆకర్షించడానికి ప్రార్థన చేస్తున్నారు. కాని మనం అలా చేయకూడదు. ఈ సందర్భంలోనే క్రీస్తు శిష్యులకు పరలోక జపం నేర్పించాడు. దీనిలో రెండంశాలు ముఖ్యం - 1. దేవున్ని చనువుతో అబ్బా లేక తండ్రి అని పిలవాలి. క్రీస్తు దేవున్ని అబ్బా పిలిచాడు. 2. నరుడు దేవుని చిత్తానికి లొంగాలి. క్రీస్తు అలా లొంగాడు. తండ్రీ! నీ చిత్తమైతే నేను ఈ పాత్రను త్రాగుతాను అన్నాడు. నరులు దేవున్ని నమ్మి జీవించాలి. ఆ ప్రభువు ఆకాశ పక్షులను గడ్డి మొక్కలను పట్టించుకొనేవాడు. నరులమైన మనలను ఇంకా అధికంగా పట్టించుకొంటాడు. కనుక అతన్ని నమ్మి జీవించడం మన బాధ్యత. 7,12 బంగారు సుత్రాన్ని బోధిస్తుంది. ఇతరులు మనకు చేయగోరిన దాన్నే మనం ఇతరులకు చేయాలి. మనకు ఒక సుత్రమూ, పరులకు ఇంకొక సుత్రాము వర్తించకూడదు. రక్షణ వట్టి మాటలవల్ల కలుగదు. అది మన చేతల ద్వారా సిద్ధిస్తుంది. దేవున్ని ప్రభూ! ప్రభూ! అని పిల్చేవాడు గాక దేవుని చిత్తానుసారంగా జీవించేవాడు పరలోక రాజ్యంలో ప్రవేశిస్తాడు-7,21. క్రీస్తు బోధలను పాటించేవాడు రాతి పునాది మీద ఇల్లు కట్టిన బుద్ధిమంతునిలాంటివాడు. పాటించనివాడు ఇసుక పునాది మీద ఇల్లు కట్టిన మందమతిలాంటివాడు. ఈ పర్వత ప్రసంగం క్రీస్తు బోధల సారం. వీటిని మన జీవితంలో పాటించాలి.



(గత సంచిక తరువాయి భాగం)

# బ్రదర్ జోసఫ్ తంబి గారు

## అస్సిసి ఫ్రాన్సీసువారి మూడవ సభ బ్రదరు

## (క్రీ॥శ॥ 1880-1945)

సాధు జోసఫ్ తంబిగారు విజయవాడ పీఠాధిపతి గ్రాసిగారి సలహా మేరకు గోధుమ రంగు అంగీ ధరించుట మాని పేద దుస్తులు ధరించారు. అవుటపల్లి చుట్టు ప్రక్కల గ్రామాలైన తేలుప్రోలు, ఉయ్యూరు, మానికొండల్లో సువార్త ప్రచారం చేశారు. క్లారమ్మ గారి తమ్ముడు వేమూరి సుబ్బయ్య గారికి వారి తీవ్ర వ్యాధి నుండి స్వస్థత కలిగింపగా వారు కుటుంబ సమేతంగా జ్ఞానస్నానం స్వీకరించారు. అప్పటికీ కొందరు అగ్రవర్ణాలవారు అడ్డు చెప్పినా తర్వాత చాలా మంది క్రీస్తు బిడ్డలుగా మారిపోయి ప్రభు ఆజ్ఞలు పాటిస్తున్నారు. బ్రదర్ జోసఫ్ తంబి గారికి ప్రతి శుక్రవారం 3 గంటలకు పంచగాయాలు బహిర్గతమై రక్తం స్రవించేవి. బహుబాధను ఒక గంటపాటు అనుభవించేవారు. కొన్ని శుక్రవారాల్లోను పెద్ద శుక్రవారం రోజున వారికి రక్త చెమట చెమర్చేది. దీనికి ఫాదర్ పగానో, ఫాదర్ అంద్రెద్, ఫాదర్ జార్జిగార్లు కండ్లారా చూసిన ప్రత్యక్షసాక్షులు. ఇంకా ఇవి చూసిన విశ్వాసులు కూడ ఎందరో ఉన్నారు.

తంబిగారు వైద్యం చేస్తుంటారు కావున ప్రతిరోజు ముఖ్యంగా శుక్రవారాల్లో బ్రదరు గారు అవుటపల్లిలో తప్పక ఉంటారని రోగులు పదుల సంఖ్యల్లో వస్తుండేవారు. ఏదో నాటుమందు ఇచ్చి ప్రార్థించి పంపేవారు. అద్భుతంగా వారికి నయమయ్యేది. కాలికి పెద్దగా గాయమై చీముపట్టి నయంకాక బాధతో వచ్చిన రోగిపై బ్రదరుగారు ప్రార్థన చేసి గాయాన్ని తన నాలుకతో నాకారు. ఇది కల్దరారో స్వామి వంట మనిషి, మాదాను శౌరయ్య చూసి అస్యహించుకుని స్వామికి తెలుపగా వారు వచ్చి బ్రదరు గారిని చీవాట్లు పెట్టారు. ఆ గాయం నయం కావడానికి అంతట ఏహ్య ప్రాయశ్చిత్తం అవసరం కాబోలు! ఏదో నాలుగు ఆకులు నలిపి గాయం మూసి కట్టు కట్టి పంపగా మూడవరోజున గాయం పూర్తిగా నయమైంది. ఇది గొప్ప అద్భుతంగా ప్రజలందరూ నేటికీ చెప్పుకుంటూనే ఉంటారు.

కొందరు పునీతుల్లో ఒకేసారి రెండు ప్రదేశాల్లో దర్శనం కావడం చదువుతుంటాం. బ్రదర్ తంబి గారికి మాత్రం 'తక్షణ గమనం' అనే దైవ వరం ఉండేదని అలా నాలుగు పర్యాయాలు ప్రదర్శితమైనట్లు చెప్పబడింది. ఏదో ఒక అద్భుత హస్తం వారి వీపుతట్టి వారు కోరుకున్న ప్రదేశంకు క్షణంలో తీసుకెళ్తుందని వారే స్వయంగా ఫాదర్ జార్జి గారికి వెల్లడించారు. బ్రదరు గారికి వర్తమాన భవిష్యత్కాలాలు బాగా తెలిసేవి. రెండవ ప్రపంచ యుద్ధ విశేషాలు తక్షణం చెప్పకలిగేవారు. మరునాటి వార్తా ప్రతికల్లో ఆ వార్తలు అలాగే కన్పించేవి. అవుటపల్లిలో గొప్ప అగ్ని ప్రమాదం

జరుగబోతోందని ముందుగానే చెప్పారు. బోయపాటి ఫ్రాన్సీసుగారిది తప్ప చుట్టు ప్రక్కల ఇళ్లు అలాగే దగ్ధమయ్యాయి. ఎదుటి వ్యక్తి మనసులోని ఆలోచనల్ని వారు తెలుసుకోగలిగి వారిని సరిదిద్దే సలహానిచ్చేవారు. వారు తమ వద్దకు వచ్చిన వారికి భోజనం పెట్టి పంపిస్తుండేవారు. వారి ఆశీర్వాదంతో పెట్టిన కొద్ది భోజనం పెరుగుతూ ఉండేది. వారు ఎప్పుడు వండుకునేవారో ఎప్పుడు తినేవారో ఎవరికీ తెలియదు. ఎవరిసాయం తీసుకున్నట్లూ లేదు. కాని వారికి నల్లకాఫీ అని అంటే ప్రీతి. పిల్లలు వారితో ఆడేవారు ఎవరిపై అయినా ఆగ్రహిస్తే వెంటనే క్షమాభిక్ష కోరేవారు.


బ్రదర్ తంబిగారు మోకాళ్లని లాటిను భాషలో ముఖ్యంగా రాత్రుళ్లు అధికంగా ప్రార్థించేవారు. కటిక ఉపవాసాలు ఆచరిస్తుండేవారు. దళిత ప్రజలను ఆదరించేవారు. తనపట్ల గౌరవం లేని వారికి దీనతతో కన్పించేవారు. వారు శరీర వర్ణపరంగా నలుపు అయినా కాంతివంతంగా కళగా ఉండేవారు. సంతోషం ఉట్టిపడుతుండేదని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పూర్వం జోసఫ్ తంబీగారు ఒకసారి ఏనాటికైనా ఫ్రాన్సీసు సభ వారు అవుటపల్లి వస్తారని చెప్పిన మాట నెరవేరిందికూడా.


కఠోర సన్యాస జీవితంలో ధన్యులైన తంబిగారు మూడు నెలలు ముందుగానే తమ మరణం గూర్చి తెల్పారు. శవ పేటికను కూడ చేయించుకున్నారు. క్రీ॥శ॥ 1945 జనవరి 15వ తేదీన వారి కోరిక ప్రకారం బోయపాటి ఫ్రాన్సీసు గారి ఇంట దివంగతులయ్యారు. అవస్థభ్యగనం ఇవ్వడానికి వచ్చిన గురువు కల్దరారోగారు వారి మృతదేహాన్ని మాత్రమే చాశారు. 16వ తేదీన ఎందరో కతోలికులు అన్యులు హాజరుకాగా గుడి ఆవరణలోనే సమాధుల వాటికలో వారి భౌతిక కాయాన్ని సమాధి చేశారు. ఆ సమాధిపై "బ్రదర్ జోసఫ్ తంబి వయస్సు 65 సం॥లు మరణం 15-01-1945" అని వ్రాయబడి ఉంది.

భక్త బ్రదర్ జోసఫ్ తంబి గారి మధ్యవర్తిత్వాన ప్రార్థించి సంతాన ప్రాప్తి, వ్యాధి నివారణలు, సమస్యలు పరిష్కారం, పరీక్షలు నెగ్గడం, ప్రమాదాలు తప్పడం వంటి వరాలు మేలులు పొందుచున్నట్లు సాక్షులు తెలిపారు.

**ధ్యానాంశం**

**ఓ దేవా!**
**నేను ఇతరులచే ముందుగా ఊరటపొందక**
**– ఓదార్చే గుణమూ, నేర్వకుండా నేర్పేగుణం,**
**ప్రేమించబడటం కాక ప్రేమించడం నేర్పండి.**
**ఎందుకనగా ఇచ్చుటలోనే పుచ్చుకోవడం ఉంది.**
**క్షమించడంలో క్షమాపణ ఉంది,**
**మరణించడంలోనే నిత్య జీవం ఉంది.**
**(పునీత అస్సీసి ఫ్రాన్సీసు వారి మూడవసభ సభ్యుల ప్రార్థన)**





# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

ఈ నెలలో మనం యేసయ్య ఉత్థాన పండుగను కొనియాడుతున్నాము. యేసయ్య సజీవుడుగా లేచాడు. సదా జీవిస్తూ మనల్ని జీవింపచేస్తాడు అన్న గొప్ప సత్యం మనం ఉత్థాన పండుగ ద్వారా ఈ లోకానికి ప్రకటిస్తున్నాం. కీర్తన కారుడు అంటున్నట్లుగా మరణము నుండి విమోచించు దేవునికి కృతజ్ఞతలు.

యెషయా 38,17-19 "నీవు నా దుఃఖమును సంతోషముగా మార్చుదువు. వినాశకరమైన పాతాళము బారి నుండి నీవు నన్ను ప్రేమతో కాపాడితివి. నా పాపములెల్ల ఎత్తి నీ వెనుక తట్టున విసరివేసితివి". ఉత్థాన పండుగ మనకు ప్రబోధించే మంచివార్త - పవిత్ర శుక్రవారంనాడు యేసయ్య అనుభవించిన బాధలు, గాయాలు, అపహాసాలు, నిందలను తండ్రి దేవుడు సంతోషంగా విజయంగా ప్రేమ గుర్తుగా మార్చారు. మనం హల్లెలూయా పాడాలి. జయజయగీతం ఆలపించాలి. ఈ లోకంలో ఎప్పుడు మనదే జయం. ఎలాంటి పరిస్థితులు మనల్ని నాశనం చేయలేవు. ఎందుకంటే ఉత్థాన క్రీస్తు మన దేవుడు, మన నాయకుడు.

యోహాను 20,19 యూదుల భయముచే శిష్యులు ఒక చోట తలుపులు మూసికొని ఉండిరి. యేసు వచ్చి వారి మధ్య నిలువబడి "మీకు శాంతి కలుగును గాక" అనెను. యేసయ్య తన ఉత్థానం ద్వారా మనకు శాంతి, సమాధానం, ధైర్యం, విజయాన్ని ఇస్తున్నారు. యేసయ్య శాంతిని మనం కలిసే ప్రతి వారికి ఇద్దాం.

అల్లేలూయా యేసయ్య మరణం జయించాడు
అల్లేలూయా యేసయ్య సదా జీవించే దేవుడు
అల్లేలూయా యేసయ్య శక్తితో సదా విజయం నాదే
అని పాడుదాం. నృత్యం చేద్దాం, యేసయ్యను స్తుతిద్దాం.

# శుభవచనం బైబిల్ క్విజ్

**సొలోమోను జ్ఞానగ్రంథము 1 - 19 అధ్యాయాలు**

పేరు ..........................ఇంటి పేరు......................విచారణ ............................

**I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి** ఫోన్ నెంబర్................................

1) జ్ఞానము ఎటువంటిది?

2) ఎటువంటి ప్రజలకు వారి కష్టములకు తగిన ఫలితమొసగెను?

3) దేనిని సమర్థించువాడు తప్పించుకోజాలడు?

4) ఎవరిని నమ్మిన వారికి తన సత్యమును తెలియును?

5) నీ జ్ఞానము ద్వారా నరుని దేనికంతటి కధిపతిని చేసితివి?

6) జ్ఞానము ఎవరికి పలుకులు ఒసగెను?

7) ప్రభువు ఎవరిని కరుణతో వదిలివేయును?

8) ఎవరి ఆత్మము ప్రపంచమునంతటిని ఆవరించి యున్నది?

9) నరులు దేనిని నమ్ముచున్నారు?

10) జ్ఞానమే మనకు ఏమీ బోధించును?

11) ........................................................తల నరయుటకు గురుతు.

12) మన బలమే ........................................................

13) నరులెల్లరును ఒక్కరీతిగనే.........................................ఒక్క రీతిగనే................................

14) ...............................................లేని నరుని ఆశలు పొగమంచువలె కరిగి పోవును.

15) ........................................., ................................ అదే శిక్ష ప్రాప్తించెను.

16) దేవుడు నాకు...........................................................దయచేసెను

17) మనము పుట్టగనే...................................................................

18) నీవు నీ.......................................................క్షణమునైన ప్రదర్శింపగలవు.

19) దేవుని తెలిసికోజాలని వారు నిక్కముగా .......................................................

20) ఎల్లరి వ్యాధిని నయము చేయు నీ ..............................వారికి.............................దయచేసెను.

21) అపుడు...........................................................పగటి వెలుగుతో తళతళలాడుచుండెను.

22) నీ ..................................................................తో కడలిని దాటిరి.

23) నిన్ను తెలిసికొనుటయే................................................................................

24. నీ మంచి తనమును ..................................................................................


25) బాల్యము నుండియు నేను ..................................................ఉండెడివాడను.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ మే నెల 5వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: సీరా పుత్రుడైన యేసు జ్ఞానగ్రంథము 1–25 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

“అపుడు ఆ రాజు తన సేవకులతో, ఇతనిని కాలు సేతులు కట్టి వెలుపల నున్న చీకటిలోనికి త్రోసివేయుడు. అచట జనులు విలపించుచు పండ్లు కొరుకు కొందురు అనెను” యేసు ప్రభు చెప్పిన పరలోక రాజ్యపు ఉపమానమును (మత్తయి 22,1-13) తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:.................................వయస్సు........తరగతి........స్థలం................**

<u>సూచన :</u>

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ మే నెల 5వ తేదీలోపు మాకు పంపించాలి.



## నీ సృష్టికర్త..... నీ యవ్వనంలో

ప్రియ స్నేహితులారా! యవ్వనస్తులైన మనం ఒకసారి పరిశుద్ధ గ్రంథాన్ని పరిశీలించి చూసినట్లయితే తండ్రి దేవుడు తన దాసులైన ప్రవక్తలను అందరిని యవ్వన ప్రాయంలోనే ఎన్నుకొని, వారి జీవితం ద్వారా ఎన్నో అద్భుతములు, ఆశ్చర్యకార్యములు జరిపించాడు అని తెలుస్తుంది. తండ్రి దేవుడు ముప్పైయేండ్ల ప్రాయంలోనే యోసేపును ఐగుప్తునకు సర్వాధికారిగా నియమించి (ఆది 41,37-49) ఆ దేశ ప్రజలను కరువు బారినుండి సురక్షితంగా కాపాడినాడు. ఇలా తండ్రి దేవుడు తాను సృష్టించిన ఈ సృష్టిని, తనను పోలిన తన ప్రియ బిడ్డలను సంరక్షించుటకు పలు సందర్భాలలో పలువురి ప్రవక్తలను, న్యాయాధిపతులను, రాజులను వారి యవ్వనంలోనే ఎన్నుకొని వారి ద్వారా తన ప్రణాళికను కొనసాగించాడు. నూతన నిబంధనలో తల్లి మరియమ్మ ద్వారా తన యవ్వన ప్రాయంలోనే తన బహిరంగ జీవితమును జీవించాడు. యేసు తన సిలువ మరణం ద్వారా (లూకా 23,26-49) మనల్ని రక్షించాడు.

"యువత పనికి రానివారు కారు. సమాజం వారి యొక్క సామర్థ్యాన్ని తక్కువగా వాడుకుంటుంది" మాలో కూడా సత్తా ఉంది అని మన మంచి క్రియల ద్వారా మనం నిరూపించుకోవాలి. మనం చేస్తున్న పనులను సంపూర్తిగా, నిబద్ధతతో చేయాలి. ఎందుకంటే మనం చాలాసార్లు ఈ పని చేయాలి, ఆ పని చేయాలి అని నిర్ణయం తీసుకుని చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పుడు, ఆ పని నుండి వైదొలుగుతూ ఉంటాం. దానికి కారణం, మనం పూర్తిగా మన సామర్థ్యంపైనే ఆధారపడుతున్నాం. మనం తలపెట్టిన పని యేసుతో కలిసి చేసినట్లయితే విజయాలను సాధిస్తాం. ఆయన మనలను చేయి పట్టి నడిపిస్తాడు. మనం చేసే

ప్రార్థనలు, అర్పించే దివ్యబలులు, ఆరాధనలు, ఇతరులకు సహాయపడుట వంటి మంచి కార్యములు ఈ యవ్వన ప్రాయమును యేసుతో కలిసి జీవించే విధంగా తోడ్పడుతాయి.

ప్రియులారా! ఆయనే మనల్ని సృష్టించాడు, జాగ్రత్తగా మనల్ని చూసుకుంటున్నాడు. తన కనుసన్నల్లో మనల్ని ఉంచి రక్షిస్తున్నాడు. ఈ యవ్వనాన్ని వృథా చేయక ఆయనను అనుసరించి జీవిద్దాం. యేసుకు మన యవ్వనంలో ప్రథమ స్థానాన్ని ఇచ్చి ఆయన దీవెనలతో జీవించే వరాన్ని దయచేయాలని ప్రార్థించుకుందాం. ఆమెన్.

"క్రీస్తు మనలను ప్రేమించినందు చేతనే దేవుని సంతోషపరచు సువాసనతో కూడిన అర్పణగను, బలిగను, మన కొరకై తన ప్రాణములను సమర్పించెను. అట్లే మీరును ప్రేమతో నడుచుకొనుడు."

(ఎఫెసీ 5,2)

## జీవస్వరం మాసపత్రిక తపస్సు కాలంలో యిర్మీయా గ్రంథం వ్రాసే పోటి

తపస్సు కాలంలో పరిశుద్ధ గ్రంథంలో ఎక్కువ సాన్నిత్యాన్ని పెంచుకొని, ధ్యానించడానికి వీలుగా జీవస్వరం మాసపత్రిక మీ అందరికి ఒక సదవకాశాన్ని అందిస్తుంది. ఫిబ్రవరి 15వ తేదీ నుండి ఏప్రిల్ 03వ తేదీ వరకు ఉన్న తపస్సు కాలంలో యిర్మీయా గ్రంథంను వ్రాయాలి. వ్రాసిన ప్రతిని ఏప్రిల్ 15వ తేదీలోపు "బిషప్స్ హౌస్, మంచిర్యాల"కు పంపించాలి. యిర్మీయా గ్రంథాన్ని వ్రాసిన తరువాత దానిని మంచిగా తయారుచేసి, మీ వివరాలను వ్రాసి మాకు పంపించండి. మీరు వ్రాసిన గ్రంథాన్ని పరిశీలించిన తరువాత సరిగ్గా ఉన్న గ్రంథాలను వ్రాసిన వారి పేర్లనుండి లాటరీ తీసి విజేతలను ప్రకటించడం జరుగుతుంది. వ్రాత (Hand writing) గానీ, అలంకారం (Beauty) గానీ విజేతను నిర్ణయించడానికి కారణాలు కావు. ఏ భాషలోనైనా వ్రాయవచ్చు

**మొదటి బహుమతి - రూ॥ 3000**

**రెండవ బహుమతి - రూ॥ 2000**

**మూడవ బహుమతి- రూ॥ 1000**




## దేవుడు నా జీవితంలో చేసిన గొప్ప అద్భుతం

నా పేరు దుర్గం శంకర్. మా స్వగ్రామం నెన్నెల. నాకు ముగ్గురు కుమారులు. గత 8 సంవత్సరాల నుండి మంచిర్యాలలోని కార్మెల్ CBSE స్కూల్లో పనిచేస్తున్నాను. మేము హిందువులం. క్లారమ్మ CMC గారి ప్రోత్సాహం ద్వారా దేవుని గొప్పతనం గురించి తెలుసుకొని ఆ తండ్రికి అసాధ్యకార్యములు ఏమియును లేవని దృఢ విశ్వాసంతో 1 సంవత్సరము నుండి చర్చికి వెళ్లడం మొదలు పెట్టాము.

నాకు జనవరి 19, 2021 మంగళవారం రోజున విపరీతమైన తలనొప్పి, వాంతులు కావడం మొదలయింది. మంచిర్యాల హాస్పిటల్‌కి వెళ్లాను. అక్కడ డాక్టరు CT స్కాన్ తీసి నాకు బ్రెన్ ట్యూమర్ ప్రాబ్లమ్ సిరియస్ కండీషన్ అని తొందరగా కరీంనగర్ హాస్పటల్‌కి వెళ్లమని చెప్పారు. కరీంనగర్‌కు అంబులెన్స్‌లో వెళ్ళాము. అక్కడ డాక్టర్ పరీక్షలు చేసి అర్జెంట్‌గా ICUలో ట్రీట్‌మెంట్ మొదలు పెట్టాలని ప్రాణానికి గ్యారంటి లేదని బ్రతికే అవకాశం లేదని చెప్పారు. ఆ సమయంలో నా ప్రాణాన్ని నన్ను నేను ఆ యేసు ప్రభుకు అర్పించాను. తండ్రీ నీ చిత్తానుసారము జరగనిమ్ము అని దేవుని మీద భారం వేసాను. సరిగ్గా 9 రోజులు ICUలోఉన్నాను. అలా రోజులు గడుస్తున్నాయి. కాని నొప్పి మాత్రం అసలు తక్కువ కావడం లేదు. CMC ప్రొవిష్యల్ హౌస్‌లో సిస్టర్లు  ఫాదర్స్, బ్రదర్స్, నా శ్రేయోభిలాషులు అందరు నా కోసం ప్రార్థనలు చేస్తున్నారని నేను తెలుసుకున్నాను. అలాంటి పరిస్థితుల్లోనే 24వ తేది ఆదివారం రోజు మధ్యాహ్నం 2 నుండి 3 గంటల సమయంలో ICU రూములో నేను పడుకున్న బెడ్ ప్రక్కన యేసయ్య వచ్చి తన కుడిచేయి చాపినపుడు యేసయ్య తన గాయపడిన కుడిహస్తం నుండి ఒక్కసారిగి ఉలిక్కిపడ్డాను. కళ్లు తెరిసి చూసే సరికి నా ప్రక్కన ఎవరు లేరు. నా చేతిని నా తలపైన తాకి చూసుకున్నాను. ఏమీలేదు. నా ఒళ్లంతా చూసుకున్నాను. ఎక్కడ ఏమీలేదు. అక్కడ ఉన్న నర్స్‌ని అడిగాను. ఇప్పుడు ఇక్కడికి ఎవరైనా వచ్చారా అని, ఆమె ఎవరు రాలేదు అని చెప్పింది. అంతా ఆశ్చశ్యంగా అనిపించింది. ఇలా జరిగిన వెంటనే నొప్పి ఉన్నట్టుండి తక్కువయింది. ఎంతో ఆశ్యర్యం! నా తండ్రి నాకు స్వస్థతనిచ్చారు. తనను నమ్మిన వారిని చేయిపట్టి విడవదని నేను విశ్వసించాను. యేసువా వందనం, యేసువా స్తోత్రం. మరుసటి రోజు డాక్టర్ మళ్లీ ఉదయం స్కానింగ్ తీసినపుడు అన్ని రిపోర్టులు నార్మల్‌గా వచ్చాయి. చావు బ్రతుకుల పోరాటం నుండి నన్ను రక్షించిన తండ్రి మీకు వేలాది పాదాభివందనాలు. నేను జీవించి ఉండడమే గొప్ప సాక్ష్యం. హల్లేలూయా స్తుతి స్తోత్రములు.

# బైబిల్ దృశ్యమాలిక


నా భర్త మంచివాడే కానీ
నాతో ఎక్కువగా మాట్లాడడు.
ఇంటి దగ్గర ఉండడు.
యజమాని చాలా
మంచివాడు
నేను నిన్ను
ప్రేమిస్తున్నాను.
నన్ను దగ్గరకు
తీసుకో..!
జోసఫ్ ఆమెను త్రోసివేసి
బయట కొచ్చాడు.
క్షమించండి
జోసఫ్
నన్ను అవమాన
పరుస్తావా!
!!?


నీవు నన్ను అవమానించావు నీ సంగతి చూస్తాను.
పోతీఫర్ తిరిగి వచ్చాడు.
ఏమిటి అలా దిగులుగా ఉన్నావు?
నీవు గొప్ప వాడిగా చేసిన ఆ దుర్మార్గుడు
జోసఫేనా...?
అవును, మీరు లేనప్పుడు నన్ను బలత్కరించబోయాడు
జోసఫ్ విశ్వాసం లేనివాడా!
?
నిన్నేం చేస్తానో చూడు

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**పరమ గీతము 1-8 అధ్యాయాలు**

1) శాంతి సౌభాగ్యములు (8,10)
2) సంభాషణము (5,16)
3) సొలోమోను (3,9)
4) దూలములను (1,17)
5) చెంతకు (2,17)
6) హృదయము (5,4)
7) దంతమయమైన (7,4)
8) స్వరమును (8,13)
9) కళంక (4,13)
10) లిల్లీపూలు (6,2)
11) ప్రేమను (7,12)
12) దావీదు (4,4)
13) ముఖము (2,14)
14) శ్రేష్ఠమైన, కీర్తింతును (1,4)
15) కర్మెలు కొండ (7,5)
16) ప్రేమ (8,7)
17) మేలిమి బంగారము (5,11)
18) షారోనును, లిల్లీని (2,1)
19) ధన్యురాలని (6,9)
20) నా ప్రియుని (2,8)
21) నా హృదయము (5,2)
22) ఉపదేశము (8,2)
23) శ్రేష్టులైన సైనికులు, రక్షకులుగా (3,7)
24) సువాసనలు (2,13)
25) అరువది (6,8)

**వచ్చే నెల పాఠ్యాంశం: సీరా పుత్రుడైన యేసు జ్ఞాన గ్రంథము 1-25 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**<u>రచయితలారా, గమనించండి! వెంటనే రచనలు పంపండి!</u>**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**<u>మా అడ్రస్</u>**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswaramadilabad@gmail.com